


# జ్ఞానయోగం

వీరపల్లె వీణావాణి

ఆ బజార్లో రజతమూర్తి బహు జాగ్రత్తగానే నడుస్తున్నాడు. అతడు మందు మీద లేడు గనుక.. తూలడం లేదు. అడుగులు తడబడడం అంతకంటే లేదు. అసలు మందన్నా, 'వందే మాతరం' జాతికి సంబంధించిన వాళ్లన్నా రజతమూర్తికి మహా అసహ్యం.

అంచేత ఆ బజార్లో నూటికి నూరు పాళ్లూ రహదారి సూత్రాలను పాటిస్తూ జాగ్రత్తగా నడుస్తున్నాడు రజత మూర్తి ఎంత జాగ్రత్తగా నడిచినా వేగంగా దూసుకు వచ్చిన ఓ కారు కింద పడబోయి వెంట్రుక వాసిలో ప్రమాదం తప్పించుకోగలిగాడతడు.

అతడు తప్పించుకున్నాడనడం కంటే పక్కనున్న ఓ పెద్దాయన తప్పించాడంటే సబబుగా ఉంటుంది. ఆ పెద్దయనే గాని చేయిపట్టి ఇవతలకి లాక్కుండా వుండి వుంటే... అప్పుల్లో భారతదేశంలా అక్కడిక్కడే రజతమూర్తి రక్తపు మడుగులో తేలుతుండేవాడు.

"చూడు బాబూ ! రహదారి సూత్రాల్ని మనం తు.చ తప్పకుండా పాటిస్తున్నాం కదాని రోడ్డు మీద ధీమాగా నడిస్తే... మన శరీరం తక్కుతుక్కైపోయి పోస్ట్‌మార్టం చెయ్యడానిక్కూడా పనికి రాకుండా పోతుంది" రజత మూర్తి వేపు చూసి నవ్వుతూ అన్నాడాయన.

ఆ పెద్దయన వేపు తల తిప్పి ఆపాద మస్తకం చూశాడు రజతమూర్తి.

"మనమే కాదు. మనకు ఎదురుగా వచ్చేవాడు కూడా రహదారి సూత్రాల్ని పాటించినప్పుడే ప్రయోజనముంటుంది. ఎదుటి వాడు నియమాల్ని ఉల్లంఘించి మన మీదికొస్తున్నప్పుడు... మనల్ని మనం రక్షించుకోవాలంటే అందుకు ఒకే ఒక మార్గముంది"

"చెప్పండి".

"మనం కూడా ఎదుటి వాడిలాగే నియమాల్ని ఉల్లంఘించి ముందుకెళ్లడం..."

చిత్రంగా చూశాడు రజతమూర్తి.

"తప్పదు మరి. అవకతవకలు జరిగే చోట... మనల్ని మనం కాపాడుకోకుండా పద్ధతుల్ని పాటించడం మన అజ్ఞానమే అవుతుంది."

ఆ మాట అనేసి ఆ పెద్దాయన తన దారిన తాను వేగంగా వెళ్లిపోయాడు.

రజతమూర్తి ముందుకు కదిలాడు.

అది... సాయంత్రం ఏడు గంటల సమయం. ఆ సమయంలో ఆ బజారు వచ్చీ పోయే జనంతోనూ, వాహనాలతోనూ చాలా రద్దీగా వుంటుంది.

ఆ సమయంలో ఆ బజార్లో నడవడం ఇంట్లో కూర్చుని టీ.వీ.లో హైదరాబాద్ ప్రోగ్రామ్స్ చూడడం కంటే ఎంతో యాతనగా వుంటుంది.

కర్ణభేరిని చీల్చేటట్లు రకరకాల వాహనాల రొదలు... కళ్లలో పడుతున్న దూళి... రజతమూర్తికి విసుగ్గా వుంది.

సరిగ్గా అప్పుడే పసుపు బట్టలతో, పెరిగిన మీసం గడ్డాలతో తిరుమలేశుని భక్తాగ్రేసరు డొకడు చేతిలో హుండీ పట్టుకొని బజార్లో వస్తున్నాడు.

భక్తి గీతాల్ని ఆలపిస్తూ... కన్పించిన వారి ముందుకల్లా వెళ్లి 'స్వామి వారికి కానుకలిచ్చుకోండి' అన్నట్లు ఆ భక్తుడు కళ్లతోటే సైగ చేస్తున్నాడు.

ఇదో రకం మోసమని, కష్టపడకుండా కాసులు సంపాదించుకొనే మార్గమని రజతమూర్తికి బాగా తెలుసు. రజతమూర్తి ముందు కొచ్చి నిలబడి ఆ భక్తుడు హుండీని చూపెడ్తూ రాగయుక్తంగా పాటందుకున్నాడు.

"ఏడు కొండలా స్వామీ ! ఎక్కాడున్నావయ్యా ?

ఎన్ని మెట్లెక్కినా"...

"ఎక్కక్కర్లేదు. అలా టి.టి.డి బస్టాండ్‌కి వెళ్లి టిక్కెట్ కొనుక్కుని తిరుమల వెళ్లే బస్‌లో కూర్చో చాలు" అపహాసంగా చూస్తూ అన్నాడు రజతమూర్తి.

బిత్తర పోయాడతడు.

రెండో లైన్ తోటే ఆ భక్తి గీతం కొండెక్కి పోయింది. అరల్డయిట్‌తో అతికించినట్లు ఆ భక్తుని పెదవులు రెండూ హఠాత్తుగా మూసుకుపోయాయి. నల్లబడ్డ ముఖంతో మెల్లగా వెళ్లిపోయాడతను.

ముఖానికి పట్టిన చెమటను తుడుచ్చుకుంటూ ముందుకు నడిచాడు రజతమూర్తి.

"సార్!" ఆ పిలుపుతో చటుక్కున నిలబడి తలతిప్పి చూశాడతడు.

ఓ ఇరవై ఏళ్ల కుర్రాడు పరుగులాంటి నడకతో అతన్ని సమీపించి.... చిదంబర రహస్యమేదో చెప్పేవాడిలా 'సార్' అన్నాడు చిన్నగా.

ముఖం చిట్లించాడు రజతమూర్తి.

"చిలకలు సార్! పంచవన్నెల రామ చిలకలు... అంతా ఇరవై ఏళ్ల లోపే. పసందైన పిందెలు. అందు కుంటారా?" అంటూ నవ్వాడా కుర్రాడు.

అర్థం కాలేదు రజతమూర్తికి.

కానీ ఆ కుర్రాడికి మాత్రం అర్థమైపోయింది. ముఖాన్ని చూసి చదివెయ్యడం అదే బజార్లో వాడు మూడేళ్ల నుండి నేర్చుకొంటున్నాడు.

"మీకు సీన్ అర్థమైనట్టు లేదు సార్! నా వెంట వచ్చారంటే... అజంతా శిల్పాల్లాంటి అమ్మాయిల్ని చూపిస్తాను. రేటు కేవలం పాతిక రూపాయలే."

వాడొక తార్పుడుగాడనీ, ఆ తార్పుడు తతంగం నిర్వహించే ప్రయత్నంలో వాడున్నాడనీ రజతమూర్తి గ్రహించడానికి ఓ క్షణం పట్టింది.

"రసగుల్లాలే అనుకోండి. మీరు గానీ వచ్చి... ఓసారి రుచి చూశారంటే... జీవితంలో ఇక ఎలాంటి పరిస్థితులల్లోనూ వదల్లేరు సార్!"

"ఎవర్ని డాక్టర్ని?"

రజతమూర్తి వేసిన ప్రశ్నతో ఆ కుర్రాడు తెల్ల ముఖం వేసుకుని చూశాడు.

"వెరీ గుడ్. ఈ తార్పుడు వృత్తిలోనే బాగా తర్ఫీదు పొందు. నీకు మంచి భవిష్యత్తుంది. తప్పకుండా రాజకీయ నాయకుడయ్యే క్వాలిటీస్ నీలో ప్రత్యక్షంగానే కన్పిస్తున్నాయి. విష్‌యూ బెస్టాఫ్ లక్."

ఆ మాటంటూ ఆ కుర్రాడి భుజాన్ని అభినందన పూర్వకంగా తట్టి వాడి ముఖంలోకి సూటిగా చూసి మందహాసం చేసి ముందుకు కదిలాడు రజతమూర్తి. అతడిప్పుడు తనను ప్రశంసించాడో, విమర్శించాడో బోధపడక... ఆ కుర్రాడు అక్కడ ఆలోచిస్తూ నిలబడి పోయాడు.

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఓ పుణ్యక్షేత్రమేనా ఇది? తిరుపతిలో వారం రోజుల పాటుండడం తనకు ఇదే మొదటిసారి. ఇక్కడ అడుగడుగునా మోసం! అంతా వంచన! దశదిశలా వ్యాపించిన దగాకోరుతనం!

ప్రతివాడూ ప్రతివాడినీ ఏదో ఒక రకంగా మోసం చేసి లాభం పొందే ప్రయత్నం.... బహుశా ఫ్లోటింగ్ పాపులేషన్ వున్నచోట ఈ ఎక్స్‌ప్లాయ్‌టేషన్ మరీ పొంచి పొంచి చూస్తూ ఉంటుందేమో!!

'రజతమూర్తిగారూ! ఏవండోయ్ రజతమూర్తిగారూ!'

ఆలోచిస్తూ నడుస్తున్న రజతమూర్తి తనను ఎవరో పిలవడంతో రోడ్డు పక్కన నిలబడి చుట్టూ కలయ చూశాడు. అంతలో రామనాథం వచ్చాడక్కడికి.

"హలో రామనాథం గారూ! మీరా?' అంటూ ఆయనకు విష్ చేశాడు రజితమూర్తి.

"ఇప్పుడెక్కడ పని చేస్తున్నారు?"

"కావలి జవహర్ భారతి కాలేజీలో" నవ్వుతూ సమాధానం చెప్పాడు రజితమూర్తి.

"నాలుగేళ్లనుండి నేను చిత్తూరు గవర్నమెంట్ కాలేజీలో చేస్తున్నాను." అంటూ జేబులోంచి సిగరెట్ ప్యాకెట్టు తీశాడు రామనాథం.

"తిరుపతికి ఏం పనిమీదొచ్చారు?"

"యూనివర్శిటీలో డిగ్రీ సెకండియర్ స్పాట్ వాల్యుయేషన్ కోసం" చెప్పాడు రామనాథం.

"నేనూ వారం రోజుల నుండి ఆ పని మీదే ఇక్కడుంటున్నాను. ఈ వారం రోజుల్లో మీరు నాకు స్పాట్ వాల్యుయేషన్‌లో ఒక్కసారైనా కన్పించలేదేం?"

"ఎలా కన్పిస్తాను రజతమూర్తిగారూ! నేను తెలుగు లెక్చరర్ని, మీరు ఇంగ్లీష్ లెక్చరర్. మీ బోర్డు కంటే మా బోర్డు వాల్యుయేషన్ అయిదు రోజులు ఆలస్యంగా స్టార్టయింది. అందులోనూ ఈసారి ఇంగ్లీషు తెలుగు రెండు బోర్డులూ ఒకే బిల్డింగ్‌లో పెట్టకుండా వేర్వేరు బిల్డింగుల్లో పెట్టారు. మీకు నేను కన్పించకంపోవడానికి కారణం అదే" అంటూ సిగరెట్ పెట్టెని తెరిచి 'అరె' అని విస్తుపోయాడు రామనాథం.

"ఏమైంది?"

"జస్ట్ అయిదు నిముషాల క్రితం... ఓ కొట్లో అరప్యాకెట్ సిగరెట్లు తీసుకున్నాను. వాడెన్ని ఇచ్చాడో నేను లెక్క పెట్టుకోలేదు. తీరా ఇప్పుడు చూస్తే ఈ ప్యాకెట్లో...." అంటూ పెట్టె వేపు చూశాడు రామనాథం.

"ఒకటి తగ్గిందా?"

తలాడించాడు రామనాథం.

"ఇది తిరుపతండి బాబూ!"

"నిజమే రజతమూర్తిగారూ! ఇక్కడ ఏ కొట్టు చూసినా ఓ కళ్యాణ కట్టే. కస్టమర్‌ని గొరిగే ప్రయత్నమే" అంటూ మందహాసం చేశాడు రామనాథం.

వాళ్లిద్దరూ ఆంధ్రా యూనివర్శిటీలో ఎం.ఏ చదివే రోజుల్లో పరిచయస్తులు. ఓ అయిదు నిముషాలు మాట్లాడి వెళ్లిపోయాడు రామనాథం.



'ప్రియా! మనం విశాఖ లేచిపోదామా?'

'నాకా ఊరు కల్సిరాలేదు. గతంలో రెండుసార్లు వెళ్లినా తిరిగొచ్చేయాల్సొచ్చింది'

ఆర్.డి.యస్. ప్రకాష్(భాగ్యనగరు)

తన పక్కనే వున్నన ఓ పెద్ద షాప్‌లోకి మెల్లగా అడుగు పెట్టాబు రజతమూర్తి.

"ఏవండీ! ఓ అయిదారు వందల్లో మంచి ట్రాన్సిస్టర్ గానీ వుంటే...."

ఆ మాటంటూ కౌంటర్‌లో వున్న ఓ యువకుని వేపు చూశాడు రజతమూర్తి.

"నమస్తే సార్! రజతమూర్తి మాస్టారు గారూ!" అంటూ ఆ యువకుడు చటుక్కున పైకి లేచాడు.

ప్రతి నమస్కారం చేశాడతను.

"బావున్నారా మాస్టారూ?"

తలాడించాడు రజతమూర్తి. కానీ ఆ కుర్రాడేవరైందీ అతనికి గుర్తురావడం లేదు.

ఓ పనిమనిషిని కేకవేసి ఓ కుర్చీ తెప్పించి అక్కడ వేయించి 'కూర్చోండి మాస్టారూ' అంటూ ఎంతో ఆదరంగా ఆయన వేపు చూశాడా యువకుడు.

మెల్లగా కుర్చీలో కూర్చుని షాపంతా ఓసారి కలయ చూశాడు రజతమూర్తి.

"మీరేం తీసుకుంటారు సార్! టీయా కాఫీయా?" అడిగాడా యువకుడు.

"అబ్బే..ఏం వద్దు" మొహమాటంతో ఇబ్బందిగా కదిలాడు రజతమూర్తి.

"భలే వారే. ఒరేయ్ వేణూ! రాజస్తాన్ టీ కొట్టుకెళ్లి అర్జంటుగా ఓ స్పెషల్ టీ పట్రా".

షాప్ యజమాని చెప్పడంతో వేణు వేగంగా టీకొట్టు వేపు వేళ్లాడు.

ఎంత ఆలోచించినా రజతమూర్తికి ఆ యువకుడెవరో గుర్తు రావడం లేదు.

'మాస్టారూ' అని సంబోధిస్తున్నాడంటే బహుశా తన పాత విద్యార్థయి వుండాలి.

"ఇంకేవిటి మాస్టారూ విశేషాలు?"

ఆ ప్రశ్నకు బదులేమి చెప్పాలో తెలియక చిరునవ్వు నవ్వాడు రజతమూర్తి.

"ఇంతకీ..నేను మీకు గుర్తున్నానా?" సూటిగా అడిగేశాడా యువకుడు.

"అదే.. గుర్తురావడం లేదు"

"నేను మీ ఓల్డ్ స్టూడెంట్ని మాస్టారూ!"

"నేనూ అదే అనుకున్నా"

"నా పేరు కిరీటి. ఆరేళ్ల క్రితం నేను... కావలిలో బి.కాం చదివాను క్లాస్‌రూంలో ఎప్పుడూ కిటికీ దగ్గరే నేను కూర్చుంటూ వుండే వాడిని"

వింటున్నాడు రజతమూర్తి.

"అందుకే మా మిత్రులందరూ నన్ను 'కిరీటీ' అనకుండా 'ఒరేయ్ కిటికీ' అని పిల్చేవాళ్లు".

"యస్.యస్. ఇప్పుడు గుర్తొచ్చింది."

"అప్పట్లో మీరు మాకు మిల్టన్ పొయెట్రీ అద్భుతంగా చెప్పేవాళ్లు."

నవ్వాడు రజతమూర్తి.

"అన్నట్టు కిరీటీ! మీ బెంచిలోనే నీ పక్కనే ఓ పొడవాటి కుర్రాడుండే వాడు".

"ఏకాంబరం గాడు లెండి. అమ్మాయిల్ని చూపుల్తోటే మానభంగం చెయ్యగల మహా ఘటికుడు. ఎం.కాం చదివి ఇప్పుడేదో బ్యాంక్‌లో వర్క్ చేస్తున్నాడు."

"అలాగా?"

"నేను మాత్రం బి.కాంతో చదువు మానేసి... ఇదిగో ఈ బిజినెస్‌లోకి దిగాను మాస్టారూ"

"మంచి పని చేశావ్".

"ఏవిటి సార్?"

"అదే..చదువు మానేసి ఇలా ఈ ఊళ్లో బిజినెస్ పెట్టుకోవడం".

"కానీ..బిజినెస్‌లో చాలా రిస్కులున్నాయిసార్. అందులోనూ ఈ ఊరు.."

"ఈ ఊరు?"

"పెద్ద మోసాల పుట్ట."

తలాడించాడు రజతమూర్తి.

"అవున్సార్! అవతలివాడి నెత్తి మీద చేతులు పెట్టడం ఇక్కడ ప్రధానమైన సంస్కృతి."

"ఆ విషయం నేను వారం రోజుల్నుంచి చూస్తూనే వున్నాను" చెప్పాడు రజతమూర్తి.

"అయితే వారం రోజుల్నుంచి మీరు..."

"ఈ ఊళ్లోనే ఓ మిత్రుడితో కలిసి లాడ్జిలో వుంటున్నాను. ఇక్కడ యూనివర్సిటీలో సెకండియర్ డిగ్రీ పేపర్స్‌ని వాల్యూ చెయ్యడాని కొచ్చాం."

అంతలో వేణు ఘుమ ఘుమ లాడుతున్న మసాలా టీ పట్టుకు వచ్చాడక్కడికి.

"తీసుకోండి మాస్టారూ!"

వేణు చేతిలోంచి గ్లాస్ అందుకుని టీసిప్ చెయ్యసాగాడు రజతమూర్తి.

"అన్నట్టు కిరీటీ!"

"చెప్పండి సార్"

"నాకో ట్రాన్సిస్టర్ కావాలయ్యా"

"ఏ కంపెనీది?"

"వాటికి సంబంధించి నాకు ఆవగింజంత పరిజ్ఞానం కూడా లేదు. ఏదో ఒకటి మంచి కంపెనీది నువ్వే సెలక్ట్ చెయ్యి."

"అయితే మీకింకా ఈ క్రికెట్ పిచ్చి పోలేదన్న మాట. క్లాసుల్లో కూడా క్రికెట్ గురించి చెబుతుండేవారు. కామెంట్రీ వినడానికేగా మీకు ట్రాన్సిస్టరు?" అడిగాడు. కిరీటి.

బదులుగా నవ్వాడు రజతమూర్తి కౌంటర్‌లోంచి లేచి నిలబడి చుట్టూ షోకేసుల్లోని ట్రాన్సిస్టర్ల వేపు ఓసారి కలయచూశాడు కిరీటి.

"ప్రస్తుతానికి మంచి కంపెనీవి ఏం లేవు మాస్టారూ! మీకు అంతగా కావాలంటే... ఒకే ఒక ట్రాన్సిస్టర్ మేడ్ ఇన్ జపాన్ వుంది. కానీ.."

"కానీ?"

"మా ఫ్రెండొకడు తెప్పించమంటే దాన్ని తెప్పించాను. అది మీకు ఇచ్చేస్తే రేపు వాడొచ్చి నాతో గొడవ పెట్టుకుంటాడేమోనని..."

'అలాంటి ట్రాన్సిస్టరే మళ్లీ తెచ్చి ఇస్తానని ఎలాగో సర్ది చెప్పేయ్ మేడ్ ఇన్ జపాన్ ఆర్టికల్సంటే నాకు చాలా ఇష్టం' అన్నాడు రజతమూర్తి.

కిరీటి రెండు క్షణాలు ఆలోచించాడు.

"సరే మాస్టారూ! నాతో రండి" అంటూ కిరీటి ఆ షాప్ వెనకున్న గోడౌన్ వేపు మెల్లగా నడిచాడు. అతన్ని అనుసరించాడు రజతమూర్తి.

వాళ్లిద్దరి వెంటా మరో యువకుడు కూడా వెళ్లాడు. అతని పేరు దయాకర్. కిరీటి వయస్సువాడే. ఆ బిజినెస్‌లో కిరీటి పార్టనర్ అతడు.

హఠాత్తుగా కరంట్ పోవడంతో ఆ గోడౌన్ అంతా అంధకారం అలుముకుంది. ఆ చీకట్లో రజతమూర్తి కొంచెం కంగారు పడ్డాడు.

"కరెంట్ లైన్ మార్చే టైంలెండి. మళ్లీ రెండు నిముషాల్లో వచ్చేస్తుంది" అన్నాడు దయాకర్.

గోడౌన్‌లో ఓ మూల వున్న పెట్టెలోంచి ఓ ట్రాన్సిస్టర్ని బయటకు తీశాడు కిరీటి.

పోయిన కరెంటు మళ్లీ వచ్చింది.

"చూడండి మాస్టారూ" అంటూ రజతమూర్తికి ట్రాన్సిస్టర్ని అందించాడు కిరీటి.

అదో ప్రముఖ కంపెనీ ఒరిజినల్ ట్రాన్సిస్టర్. తళతళలాడుతోంది.

దానికి బ్యాటరీలు వేసి ఆన్ చేసి చెక్ చేసి చూపించాడు కిరీటి. బాగా పని చేస్తోంది. దాని వేపు తృప్తిగా చూసి. దాన్ని తన సంచిలో పెట్టుకున్నాడు రజితమూర్తి.

"ఎంతిమ్మంటావ్ కిరీటీ?" గోడౌన్ లోంచి షాప్‌లోకి వచ్చాక అడిగాడు. రజితమూర్తి.

"మీ దగ్గర బేరమేమిటి మాస్టారూ! ఎంతో కొంత యివ్వండి" నవ్వాడు కిరీటి.

"నోనో. వ్యాపారం అన్నాక మొహమాటాలుండ కూడదు. ఇది డబ్బుకు సంబంధించిన విషయం."

"మాకు పడే రేటు వెయ్యి రూపాయలు. పరాయి వాళ్లకైతే ఓ వంద ఎక్కువ కమ్ముతాము."

రజతమూర్తి జేబులో చెయిపెట్టాడు.

"ఎంతైనా మీరు గురువుగారు. మీ దగ్గర లాభం తీసుకోవడం బావుండదు."

తలాడించాడతడు.

'వెయ్యి రూపాయలివ్వండి చాలు."

రజితమూర్తి పది వందరూపాయల నోట్లను జాగ్రత్తగా లెక్కపెట్టసాగాడు.

కిరీటి కూడా అతని చేతుల వేపు చూస్తూ తను కూడా మనస్సులో లెక్కపెట్టుకున్నాడు.

సరిగ్గా వెయ్యి.

అంతలో మళ్లీ కరెంటు పోయింది.

"ఇదిగో లెక్కపెట్టుకో కిరీటీ!" కిరీటి చేతికి డబ్బులందించాడు రజతమూర్తి.

చీకట్లోనే రెండవసారి కూడా లెక్క పెట్టుకుని 'సరిపోయాయి' అన్నాడు కిరీటి.

"ఈ కరెంటు ఇప్పుడల్లా వస్తుందో రాదో! సరే. ఇక నేను వెళ్తాను" అన్నాడు రజితమూర్తి.

"మంచిది మాస్టారూ!"

ఆ చీకట్లో మెల్లగా ఆ షాప్ లోంచి బయట పడి లాడ్జి వేపు నడిచాడతడు.



'నీ జబ్బు పూర్తిగా నయమైంది. అయితే మనసుకు బాధ కలిగే పనులేవీ చేయకు'

'అలాగే డాక్టర్. మీకు ఫీజివ్వాలంటే నామనసుకెంతల బాధగా ఉందో.' అంటూ చక్కపోయాడు పేషెంట్.

ఆర్.డి.యస్. ప్రకాష్(భాగ్యనగరు)

"కిరీటీ! నాకంతా అయోమయంగా వుంది" కొవ్వొత్తిని వెదకుతూ అన్నాడు దయాకర్.

"ఎందుకూ?"

"నాకు తెలిసి ఈ ఊళ్లోనే ఇంటర్ మూడుసార్లు తప్పావు. కావలి కాలేజ్‌లో ఆరేళ్ల క్రితం.. నువ్వు బి.కాం ఎప్పుడు చదివావు నాతండ్రీ?" అడిగాడు దయాకర్.

"కావలిలో బి.కాం చదవడం కాదు కదా. కనీసం ఆ టౌన్‌ను నేనిప్పటి వరకు చూడలేదు కూడా" అంటూ విరగబడి నవ్వసాగాడు కిరీటి.

"అయితే ఇప్పటి వరకు..."

"నేనాడింది డ్రామా మాత్రమే. ఓ ఇరవై నిముషాల క్రితం మన షాప్ ముందు నిలబడి.. ఈ పూర్ ఫెలో రజతమూర్తి అనబడే అమాయకుడు."

"చెప్పు"

"రామనాధం అనే ఫ్రెండుతో మాట్లాడుతూ వుంటే.. వాళ్ల సంభాషణ మొత్తం నేను ఈ కౌంటర్లో కూర్చుని జాగ్రత్తగా విన్నానోయ్."

"వింటే?"

"ఇంకేముంది? ఊరూ, వృత్తీ మొదలైన విషయాలన్నీ వాళ్ల సంభాషణ వల్ల నాకు తెల్సిపోయాయి. అందుకే చిన్న ట్రిక్ చేశాను"

దయాకర్ ఆశ్చర్యపోయాడు.

"ఈ ట్రిక్ చెయ్యడం వల్ల మనకొచ్చిన లాభం ఎంతో తెలుసా? మూడు వందలు. తన తెలివి తక్కువ తనానికి ఓ రకంగా అతడు చెల్లించిన అపరాధం."

"పాపం !"

"పాపమేవిటోయ్ నా బొంద! ఇది వ్యాపారం. ఇందులో పాపపుణ్యాలకు చోటు లేదు. ఎవడెంత మోసకారైతే వాడంత గొప్పగా ఈ వృత్తిలో రాణిస్తాడు."

"ఏదేమైనా.. యిది మాత్రం.."

"చాలా అన్యాయమంటావ్. చూడు దయాకర్!: నేను తన ఓల్డ్ స్టూడెంటని తెలియడం తోటే... చీప్‌గా ట్రాన్సిస్టర్ కొట్టేదామని ఆలోచించాడతడు. అది అన్యాయం కాదా? ఒక వస్తువును విపరీతమైన ధరకు అమ్మాలనుకోవడం ఎంత అధర్మమో. దాన్ని చౌకగా కొని అవతలివాడికి లాభం మీద దెబ్బకొట్టాలనుకోవడం కూడా అంతే అధర్మం."

"అతను నీ మాటల్ని బాగా నమ్మేశాడు" అన్నాడు దయాకర్ కొవ్వొత్తిని వెలిగిస్తూ.

"నమ్మినవాడినే కదా సులభంగా మనం మోసగించ గలిగింది! చూడు దయాకర్! ఈనాడు ఈ లోకం ఓ పెద్ద క్రీడాస్థలం. జీవితమంటే ఓ పరుగు పందెం. ఈ పందెంలో ప్రతివాడూ రెండోవాడికి పరోక్షంగా ప్రత్యర్థి. ఈ పందెంలో మనం గెలవాలనుకున్నప్పుడు. పక్కవాడిని బోల్తా కొట్టించక తప్పదు. అదే నేటి మానవజాతి నీతి" అంటూ సిగరెట్ వెలిగించాడు కిరీటి.

సరిగ్గా అదే సమయంలో...

భీమాస్ లాడ్జిలోని ఓ గదిలో.. తన మిత్రుడు రమాపతితో జరిగిన విషయాన్ని మొత్తం వివరించి పగలబడి నవ్వసాగాడు రజతమూర్తి.

'అది సరే మూర్తీ! ఆ షాప్ వాడేదో ట్రిక్ ప్లేచేస్తూ...నిన్ను బోల్తా కొట్టించబోతున్నాడని నువ్వెలా గ్రహించ గలిగావు?' అడిగాడు రమాపతి.

'వెరీ సింపుల్'.

"ఎలా?"

"ఆరేళ్ల క్రితం వాడు కావలిలో మన జవహర్ భారతి కాలేజీలో బి.కాం చదివానన్నాడు. అదే నిజమైతే నేను వాడికి తెలిసే అవకాశమే లేదు. ఎందుకంటే ఆ కాలేజీలో నేను లెక్చరర్‌గా చేరి నాలుగేళ్లు మాత్రం అయింది."

"నిజమే"

"పైగా నేను మిల్టన్ పొయిట్రీ చాలా బాగా టీచ్ చేసేవాడినని నన్ను పొగిడాడు. ఇంతవరకూ ఏ క్లాసుకూ నేను మిల్టన్ పొయిట్రీ చెప్పలేదు. అందులోనూ క్లాసుల్లో నేను క్రికెట్ గురించి చెబుతుండేవాడినని ఓ పెద్ద కోత కోశాడు. నాకు క్రికెట్ పిచ్చన్నాడు. నిజానికి నాకు క్రికెట్ స్కోర్‌ని కూడా అర్థం చేసుకోవడం తెలియదు."

"అదన్నమాట విషయం !"

"నన్ను బోల్తా కొట్టించబోయి వాడే బోల్తాపడ్డాడు. నా చొక్కాజేబులోంచి వందరూపాయల నోట్లు పది తీసి లెక్కపెట్టాను. వాడది గమనించాడు. అప్పుడే కరెంట్ పోయింది. ఆ చీకట్లో.. చటుక్కున నా ప్యాంటు జేబులోని యాభైరూపాయల నోట్లు పది తీసి వాడి చేతిలో పెట్టి వచ్చేశాను. వాటిని వందరూపాయల నోట్లనుకున్నాడు పూర్‌ఫెలో. తప్పదు మరి! అవకతవకలు జరిగేచోట మనల్ని మనం కాపాడుకోకుండా.. పద్ధతుల్ని పాటించడం మన అజ్ఞానమే అవుతుంది. అందుకే జ్ఞాన మార్గాన్ని అవలంబించాను" అన్నాడు నవ్వుతూ రజతమూర్తి.

●